కథా నిలయం
1469
శ్రీకాకుళం

# భారతంలో స్త్రీ

---

అంబాసిడరు కారు రోడ్డు పక్కగా ఆగింది!

ఇంజను ఆపుచేసి కారు దిగేడు అంబయ్య—

సందు చీకటిగా వుంది.

రోడ్డు మీదనుంచి రెండడుగులు ముందు కేసి 'బుచ్చమ్మా ... బుచ్చమ్మా ...' పెద్దగా కేకేశాడు.

పిల్లలనిద్దర్నీ చెరొకపక్కన పడుకోబెట్టుకుని మంచి నిద్రలో వున్న బుచ్చమ్మ వులిక్కిపడి లేచింది.

నులకమంచం మీద పడుకున్నదల్లా లేచి కూర్చుని ఆవులిస్తూ రోడ్డువేపు చూచింది.

ఆ పిల్చింది ఎవ్వరైందీ చీకట్లో పోల్చుకోలేక "ఎవరా పిల్చేది..." అంటూ అడిగింది.

"నేనే అంబయ్యను. అమ్మగారూ పిల్లలూ ఇప్పుడే [illegible]నుంచి వచ్చారు. నిన్ను పిల్చుకురమ్మన్నారు. తొందరగా బయల్దేరు.

"నువ్వా అంబయ్యన్నా!... వస్తున్నా ..." అంటూ లేచి వూడిపోయిన జుట్టు ముడేసుకుని గబగబా బయలుదేరింది వున్న ఫళంగా.

చిన్నపిల్లలిద్దరూ ఇంట్లో వంటరిగా ఎట్లా వుండగలరనే అనుమానమే కలుగలేదు బుచ్చమ్మకు ఆ తొందర్లో. పిల్చుకు రమ్మని తీరా కారిచ్చి పంపేక తాను రానంటే ... రేపు ఆఫీసుకెళ్ళేక అయ్యగారు చీవాట్లు పెడతారేమోనని బయలు దేరక తప్పలేదు. కారు బయల్దేరింది!

"అన్నాయ్ ... మళ్ళీ నేను వంటరిగా ఇంటికి తిరిగి రాలేను. మా ఇంటిదాకా వచ్చి తోడుగా దిగబెట్టవూ ..."

బుచ్చమ్మ మాటల్లో అమాయకతకు చలించిపోయాడు అంబయ్య.

బుచ్చమ్మ మొగుడు శేషయ్య తనూ ఒకేరోజు డ్రైవరుద్యోగానికి కుదిరేరు. మంచి స్నేహితుల్లాగ ఎన్నో ఏళ్ళు మెలిగేరు. దురదృష్టవశాత్తూ యాక్సిడెంటులో శేషయ్య మరణించాడు.

అలాంటి స్నేహితుడి భార్య తనకు తోబుట్టువు కాక పోయినా ... అన్నయ్యాని పిలుస్తున్నది.

రేపు తాను చచ్చిపోయినా తన భార్య పరిస్థితి....?

ఇంకా ఎన్నో ఆలోచన్లు అంబయ్యను తికమకపెట్ట సాగేయి.

కారు ఆపాడు.

" ఎందుకన్నయ్యా కారేపేవు? ... "

"చూడు చెల్లమ్మా! నువ్వెంతో అమాయకురాలివి. పిల్లల్ని సాక్కుంటూ గుట్టుగా సంసారాన్ని గడుపుకొస్తున్నావు. మావాడు పోవటంతో నువ్వు స్వీపరు వుద్యోగంలో చేరటం తప్పనిసరైంది — ఇన్ని నిజాలు తెల్సిన నేను నిన్ను అన్యాయం చెయ్యలేను.... " చెమట పట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ చెప్పలేక చెప్పేడు.

అసలు విషయమేమిటో?... మధ్యలో కారాపి ఇలా ఎందుకు మాట్లాడుతున్నాడో బుచ్చమ్మకు బోధపడలేదు.

" బీదోళ్ళ బతుకులో నిప్పులు పొయ్యాలని చూస్తారు గొప్పోళ్ళు. — డబ్బుతోపాటు మనబోటి వాళ్ళకు మానాభిమానాలు లేవని వాళ్ళుద్దేశం—పొట్టగడవక ఆడది వుద్యోగానికొస్తే... దాని బతుకే పాడుచెయ్యాలని చూస్తారు...." అంటూ బీడీ ముట్టించాడు.

"తొందరగా పోదాం అన్నయ్యా. ఆలస్యమైతే అమ్మగారు కోప్పడతారేమో?... బిక్కు-బిక్కుగా చూస్తూ అంది.

"నువ్వో సత్తెకాలపు మనిషివి చెల్లమ్మా. నిన్న రాత్రి హైదరాబాదు వెళ్ళిన అమ్మగారు అప్పుడే తిరిగి వొచ్చారంటే నువ్వెట్టా నమ్మేవు? ..."

"మరైతే నన్నెక్కడికి తీసుకుపోతున్నావ్ ? –"

"అయ్యగారింటికే! అమ్మగారు ఎట్లాగూ లేదుగదాని.. అయ్యగారు నిన్ను తీసుకురమ్మన్నారు..." నిర్జీవంగా చెప్పేడు.

అంబయ్య మాటలకు నివ్వెరపోయింది.

"దొంగనాయాలు. వంటరిగా బంగళాలో కూర్చుని పీకలదాకా తాగేడు. అప్పటికే పది గంటలు కావచ్చింది. నేను ఇంటికి పోతానన్నాను. ససేమిరా వీల్లేదన్నాడు. తాగిన మైకంలో చిందులు తొక్కుతూ నోటికొచ్చినట్లల్లా తిట్టాడు. ఎట్లాగైనాసరే నిన్ను తీసుకురమ్మన్నాడు. బీదోళ్ళ బతుకులు పాడు చెయ్యొద్దండీ అని బ్రతిమిలాడాను – నా చెంప ఛెళ్ళు మంది – నిన్ను తీసుకురాకపోతే నా వుద్యోగమే తీసేస్తానన్నాడు. బయలుదేరక తప్పలేదు. మనసులో ఇష్టంలేకపోయినా. చెల్లమ్మా! నీతో అపద్ధం చెప్పి ఇంతదూరం తీసుకొచ్చినందుకు నన్ను క్షమించు – నువ్వాక్కడికి రావద్దు. నువ్వు కళ్ళబడ్డావంటే నీబతుకు నాశనం చేస్తాడు. నువ్వెనక్కు తిరిగి వెళ్ళిపో... నేనేదో సంజాయిషీ చెప్పుకుంటాను..." అనేసి ఆరిపోయిన బీడీని దూరంగా విసిరేశాడు.

"అయ్యగారు అట్టాంటి మనిషి కాదన్నయ్యా. నేను వారింట్లో నాలుగు నెలలుగా పన్జేస్తున్నా ... నా ముఖంలోకి ఎప్పుడూ చూడనైనా లేదు ...అయినా అంతటి గొప్పోళ్ళకి నాలాంటి మనిషే కావాల్సొచ్చిందా?..."

"ఆయన సంగతి నీకేందెల్సు చెల్లమ్మా! అమ్మగారి ఎదుట పిల్లిలా వుంటాడు. ఆమె వూళ్ళోలేకపోతే చూడాలి ఈయనగారి భాగోతం—పీకలదాకా తాగుతాడు. మనస్సైన దాన్ని ఇంటికి తెచ్చుకుంటాడు. గొప్పోళ్ళు సీకట్లో చేసే పాపాలు అందరికీ అగపడవ్ — నువ్వు పన్లో కుదిరినప్పటి నుండీ నీమీద కన్నేసే వుంచాడు."

"నువ్వు దేవుడిలాంటి వాడివన్నయ్యా! నా బ్రతుకు నరకం కాకుండా కాపాడేవు ..." కారు దిగుతూ అంది.

"నువ్వు ఎవ్వరినీ నమ్మి మోసపోయి బతుకు నాశనం చేసుకోవద్దు చెల్లమ్మా! జాగ్రత్త!! ..." కారు స్టార్టు చేసుకుని వెళ్ళిపోయాడు అంబయ్య.

భర్తవున్నన్నాళ్ళూ ... బుచ్చమ్మ ఇంటిగడప దాటాల్సిన అవసరమే రాలేదు. వంటపని, ఇంటిపనులతో పొద్దంతా సరిపెట్టుకునేది.

భర్తకు తాగుడు, పేకాటే కాదు ... సంపాదనంతా బ్రాకెట్ ఆటలో పెట్టి నెలంతా అప్పు చేసేవాడు! —

అయినా బుచ్చమ్మను ప్రాణప్రదంగా చూచుకునేవాడు శేషయ్య.

నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద నడిచి వస్తుంటే బుచ్చమ్మ ఆలోచన్లు గతంలోకి దొర్లిపోయినయ్.

ఇల్లు చేరుకునే సరికి చంటోడు లేచి కూర్చుని ఏడుస్తున్నాడు.

ఒక్క అంగలో మంచం చేరుకుని పసివాడిని అక్కున చేర్చుకుంది.

ఆ రాత్రంతా భర్తకళ్ళల్లో మెదుల్తూనే వున్నాడు. ఎన్నో రకాల ఆలోచన్లతో అంతకు మించిన భయంతో కన్ను మూయనేలేదు.

* * * *

బుచ్చమ్మ అచ్చంగా కన్యాశుల్కంలో 'బుచ్చమ్మ' లాగే అందంగా అమాయకంగా వుంటుంది ముమ్మూర్తులా.

కాస్త నలుపన్న మాటేగాని ... ముఖంలో కళ వుట్టి పడ్తూంటుంది.

పంచపాండవులకు ద్రౌపది లాగా ఐదు ఆఫీసులకు బుచ్చమ్మ వక్కతే స్వీపరు.

రూపాయి చిల్లర చేతికిచ్చి లెక్కించమంటే చేతగాని మనిషి! చదువూ సంధ్యా లేకపోయినా ... బుచ్చమ్మలో మంచితనం బోలెడుంది. ముఖంలో చిరునవ్వు తప్ప మరోవిధ

హైన భావమే కన్పించదు. చెప్పిన ప్రతిపనీ తు. చ. తప్పకుండా చేస్తుంది.

తెల్లనివన్నీ పాలు ... నల్లనివన్నీ నీళ్ళు అనుకునే భోళామనిషి.

* * *

భర్త డ్రైవరుద్యోగం చేస్తూ యాక్సిడెంటులో అకస్మాత్తుగా చనిపోవటంతో, బుచ్చమ్మకు స్వీపరుద్యోగాన్ని ఇచ్చి శేషయ్య సంసారాన్ని ఆదుకుంది డిపార్టుమెంటు.

డ్యూటీలో చేరిన మొదటి రోజే అటు ఆఫీసరు దగ్గర నుంచీ ఇటు ఆఫీసు బోయ్ దాకా అందరికళ్ళూ బుచ్చమ్మ మీదనే కేంద్రీకరించ బడ్డయ్.

బుచ్చమ్మ వి. ఐ. పి. కాకపోయినా ... ఆడది కావటంతో, అందులోనూ నడివయస్సులో వున్న విధవరాలు అయినందువల్ల అందరి కళ్ళల్లోనే కాదు ... ఆలోచనల్లో కూడా ఆమెకో ప్రత్యేకస్థానం వుంది.

బుచ్చమ్మ బీదరికాన్నీ, మంచితనాన్నీ తక్కువ స్థాయి వుద్యోగిగదానే అలుసునూ ఆధారం చేసుకుని ... అందరూ తలో క రకంగా జాలిపడటం మొదలెట్టారు.

ఆమె పిల్లల తల్లి! కట్టుకునేది నూలుచీరె! చేస్తున్నది స్వీపరుద్యోగం! — అయినా ఎస్టాబ్లిష్‌మెంట్ గుమాస్తా సుబ్బారావు దృష్టిలో బుచ్చమ్మ రంభ! నెలనెలా జీతమిచ్చే పేక్లార్కు ఆచారి వూహాలో ఆమె అప్సరస!!. తలనెరిసి

రిటైర్మెంటుకు సిద్ధంగా వున్న హెడ్డుమాస్టర్ రాజారావులో అన్నీ వుడిగి పోయినా బుచ్చమ్మను చూస్తుంటే మాత్రం లోలోపల లొట్టలేసుకుంటూ వుంటాడు.

*　　*　　*　　*

పనివున్నా లేకపోయినా అందరూ బుచ్చమ్మను పిల్చే వాళ్ళే!

ఒకరు కాఫీ తెమ్మంటే ... మరొకరు సిగరెట్లు ... ఇంకొకరు పోస్టుకార్డు ... ఇలావంతు వేసుకుని పన్లు పురమాయిస్తూ ఒక్క క్షణం కూడా కూర్చోనీకుండా చెండుకుతినటం అందరికీ హాబీ!

అపాయింట్‌మెంట్ కోసం వచ్చిన మొదటిరోజే ఆమెను ఆపాద మస్తకం పరీక్షించిన సుబ్బారావు ... యుక్తవయస్సులోనే ఆమెకు జరిగిన అన్యాయానికి జాలిపడ్డాడు.

ఆ జాలితో ఫైలు ఆలస్యం చెయ్యకుండా తానే ఆఫీసరు దాకా స్వయంగా మోసుకెళ్ళి మరునాటికే అపాయింటుమెంటు ఆర్డరు విడుదల చేశాడు.

బుచ్చమ్మపట్ల సుబ్బారావు తీసుకుంటున్న ప్రత్యేకమైన శ్రద్ధను, ఆఫీసులో మిగతా గుమాస్తాలు పసికట్టకపోలేదు.

ఆమెపట్ల జాలీ, సానుభూతీ సుబ్బారావులో ఎక్కువపాళ్ళల్లో వుండటం వల్ల బుచ్చమ్మ ఆఫీసు సమయాల్లో మరో

గుమాస్తాతో నవ్వుతూ మాట్లాడితే అతగాడికి కోపంతో వళ్ళు పొంగిపోతుంది. బ్లడ్ ప్రెషెర్ వచ్చిన పేషంటులా ఫీలవుతాడు.

అయ్యగారి తర్వాత అంతటివాడుగా కన్పించటంతో... ఆఫీసువేళ తర్వాత సుబ్బారావు ఇంటికి పని చేయటం కోసం వెళ్ళటం బుచ్చమ్మకు తప్పని సరైంది.

రాను రానూ వాళ్ళ పిల్లలకు నీళ్ళు పొయ్యటం.... అక్కడే అప్పుడప్పుడు భోజనం చేయాల్సి రావటంతో వాళ్ళ కుటుంబానికి మరింత సన్నిహితురాలైంది.

*      *      *      *

పేక్లార్కు ఆచారి వట్టి పిరికి సన్యాసి! గుడ్లు మిటకరించి చూస్తాడన్నమాటేగాని.... కథ నెలా ప్రారంభించాలో బొత్తిగా తెలీదు.

బుచ్చమ్మంటే పడిచచ్చే వాళ్ళల్లో ఆచారి మూడో వాడు. మనిషిని చూస్తూ గుటకలు మింగుతాడు.

ఏదో పనివున్న వాడిలాగ పదినిముషాల కోసారి పిలుస్తాడు. తీరా ఆమె దగ్గరగా వచ్చి నిల్చుంటే... ఏం మాట్లాడాలో తెలీక, మరోసారి నస్యం పీల్చి వెకిలిగా నవ్వి కాఫీ తెమ్మంటాడు.

మరేవిధమైన సాహసమూ చెయ్యలేని ఆచారి.... మొదటి తారీకున బుచ్చమ్మకు జీతమిచ్చేటప్పుడు మాత్రం,

పే బిల్లు మీద ఆమె వేలి ముద్ర వేయించే నెపంతో ఆమె బొటనవేలు పట్టుకుని అటూ ఇటూ సుతారంగా తిప్పుతూ మనసులో కోరికను నెమరువేసుకుంటూంటాడు. అతగాడి కదో తృప్తి! ఆ అనుభూతిలో వున్న హాయి మరెందులోనూ లేదేమో? —

* * * *

నాలుగోవాడు వెంకటేశ్వర్లు!

అందరికంటే అరగంట ముందుగానే ఆఫీసుకొస్తాడు. రాగానే బుచ్చమ్మను పిల్చి కాఫీ తెప్పించుకుంటాడు. తర్వాత సిగరెట్ పాకెట్ తెమ్మంటాడు. ఆ తర్వాత వక్కపొడి పొట్లం! — అన్ని పన్లూ వక్కసారిగా చెప్పి తెప్పించుకోక పోవటం అతనిలో వున్న ప్రత్యేకత.

ఎక్కువసార్లు తన దగ్గరకు రప్పించుకోవాలనే తాపత్రయంతో ఒక్కొక్కసారి ఒక్కొక్కపని పురమాయిస్తాడు. అతని దగ్గరకు ఆమె ఎన్నిసార్లు వస్తే అంత తృప్తి.

ఒకరోజున... ఎవ్వరూ లేని సమయంలో బుచ్చమ్మను పిల్చి తన్లోతాను నవ్వుకుంటూ.... సొరుగులో దాచివుంచిన 'బూతు' పుస్తకంలో బొమ్మలు చూపిస్తూ ఆమె అమాయక మైన ముఖంలోకి అదోలా చూస్తూ సంతోషపడ్డాడు.

వెంకటేశ్వర్లు చేతల్లో చూపుల్లో అర్థాన్ని వెంటనే

గ్రహించలేకపోయినా తర్వాత తెలుసుకుని దూరంగా వుంటూ వచ్చింది.

*    *    *    *

ఆ రోజు సాయంత్రం ఆఫీసు వదలగానే సుబ్బారావు ఇంటికెళ్ళింది బుచ్చమ్మ.

భార్య కడుపు నొప్పితో బాధపడుతూ మనిషి మెలికలు తిరిగిపోతోంది.

డాక్టరు ఇంటికొచ్చి పరీక్ష చేసి వెంటనే ఆస్పత్రిలో చేర్చాలన్నాడు.

భార్య ఆస్పత్రిలో చేరటంతో పిల్లలపనీ, ఇంటిపనీ బుచ్చమ్మ నెత్తిన పడ్డది.

తాను ఆఫీసుకు శలవుపెట్టి... మరో ఆడమనిషి సహాయం కావల్సి రావటంతో బుచ్చమ్మచేత కూడా నాలుగు రోజులు శలవు పెట్టించాడు. సుబ్బారావు.

వంటపని పూర్తిచేసి పిల్లలను బడికి పంపి కేరేజిలో అన్నంపెట్టి ఇవ్వగానే సుబ్బారావు ఆస్పత్రికి వెళ్ళాడు.

మరోగంటలో తిరిగొచ్చాడు.

"ఎలావుందండీ అమ్మగారికి?—" ఆదుర్దాతో అడిగింది బుచ్చమ్మ.

"నొప్పి మాత్రం తగ్గలేదు. రేపు ఆపరేషన్ చేస్తామన్నారు..." బట్టలు మార్చుకుంటూ చెప్పేడు.

సర్ఫులో తడిపి వుంచిన పిల్లల బట్టలు వుతికేందుకు భాత్ రూములో కెళ్ళింది.

లుంగీ కట్టకుని ఈజీఛైర్లో పడుకున్న సుబ్బారావు మస్తిష్కాన్ని ఆలోచన్లు వెంటాడ సాగేయి.

సిగరెట్ వెలిగించి తక్కున లేచాడు. అడుగులో అడు గేసుకుంటూ భాత్ రూము దాకా వెళ్ళాడు.

గుండె భయంతో దడదడ కొట్టుకో నారంభించింది. సిగరెట్ ఆఖరిదమ్ము గట్టిగాపీల్చి కిటికీలోంచి విసిరేశాడు.

సుబ్బారావు రాకని గమనించని బుచ్చమ్మ కూర్చుని బట్టలు వుతమటంలో నిమగ్నురాలైంది.

నిల్చున్న వాడల్లా వంగుని తన రెండు చేతులూ బుచ్చమ్మ చేతుల కిందుగా పోనిచ్చాడు.

ఆ స్పర్శకు లేడిలా చెదిరి పోయిన బుచ్చమ్మ తప్పించు కుని గబగబా హాల్లోకి నడిచింది. బిత్తర చూపులు చూస్తోంది. మనిషి బెదిరిపోతోంది.

తప్పు చేసిన వాడిలా తలదించేసుకున్న సుబ్బారావు "చూడు బుచ్చమ్మా! నువ్వంటే నాకెంతో అభిమానం. వయసులోవున్న నీకు దేవుడు తీరని ద్రోహం చేశాడు. వుప్పూ కారం తినే మనుష్యులం మనం — మరో కంటికి తెలీనీను మన విషయం. . ." ఇంకా ఏదో చెప్పబోయాడు.

"తప్పండీ! దేవుడు అన్యాయం నా కెట్లాగూ చేశాడు. అయినా మీ వంటి వాళ్ళ మంచితనంతో ఆ ఇద్దరి పిల్లల్నీ చూచుకుంటూ బ్రతుకుతున్నాను. నా బ్రతుకు పాడు చెయ్యకండి. ఇంకెప్పుడూ నన్ను గురించి తప్పుగా ఆలోచించ ద్దండీ .." వలవలా ఏడ్చేసింది.

ఇంటి కొచ్చాక పిల్లల్నిద్దర్నీ డొక్కలో పెట్టుకొని బావురు మంది.

ఆ తర్వాత రెండు రోజుల వరకూ మళ్ళీ సుబ్బారావు ఇంటి గుమ్మం తొక్కనే లేదు.

*    *    *

రోజులు దొర్లిపోతున్నయ్.

ఎందరు ఎన్నిరకాలుగా అనుకున్నా, ఆడి పోసుకుంటున్నా... బుచ్చమ్మ ధ్యేయం వక్కటే! బ్రతికినన్నాళ్ళూ తాను గౌరవంగా బ్రతకాలి!!

తనకు అండలేదు. మగదిక్కు కరువైంది. ఆ కారణం గానే తనను చులకనచేసి జీవితాన్ని నవ్వులపాలు చెయ్యాలని చూస్తున్నారంతా!

దసరాపండుగ దగ్గర పడ్డది. —

ఆఫీసు ప్యూను రామయ్యకి అందరి దగ్గరా అడిగల్లా మామూళ్ళు వసూలు చేసుకుంటున్నాడు.

అడక్కపోయినా పిల్చి బుచ్చమ్మకు తలా కాస్త ఇచ్చారు.

రామయ్య కంటే బుచ్చమ్మకే ఎక్కువ డబ్బు వస్తూ
త్తోంది.

ఆడదికదాని, వారి వారి స్వార్థాలకు మనసుల్లో రూప
కల్పనలు చేసుకుంటూ... గొప్పకోసం రూపాయి ఇవ్వదల్చు
కున్న వాడు రెండు; రెండు ఇచ్చేవారు ఐదూ పోటీపడి మరీ
ఇచ్చారు.

అందరికంటే ఎక్కువిచ్చింది పిల్లికైనా బిచ్చం పెట్టని
రాజారావు. పంచ పాండవుల్లో ఆఖరివాడు.

*   *   *   *

మర్నాడు రెండో శనివారం, ఆదివారం కావటంతో
నాలుగింటికల్లా బిల బిలమంటూ గుమాస్తాలంతా వెళ్ళి
పోయారు.

హెడ్ క్లార్కు రాజారావొక్కడే కూర్చుని ఫైళ్ళు
చూచుకుంటున్నాడు.

బుచ్చమ్మ తలుపు ఆనుకుని కూర్చుని కవర్లు తుమ్మ
బంకతో అతికిస్తోంది.

"బుచ్చమ్మా..." రాజారావు పిలుపులో మార్దవం
పుట్టిపడ్డది.

చేస్తున్నపని ఆపుచేసి "పిల్చారా సార్" అంది.

"మరేంలేదు. నువ్వు సినీమాచూచి ఎన్నాళ్ళయిందీ?– మీ అమ్మగారు బ్రతికున్న రోజుల్లో చూశాను నేను. మళ్ళీ ఎందుకో ఇవ్వేళ చూడాలన్పిస్తోంది వెళ్దాం. రారాదూ? –" అనేసి దిక్కులు చూశాడు.

"నాకెందుకు బాబూ సినిమాలు? – నా బతుక్కి సినీమా నే తక్కువ. మీరెల్లండి..." కిటికీ తలుపులు వేస్తూ అంది.

"పిచ్చిదానా.... నీ మొగుడు బ్రతికుండగా ఏం సరదాలు తీరాయో ఏమో?— సినీమాకు రాకపోతే మానె... శనాదివారాల్లో అలా సరదాగా నాగార్జునసాగర్ వెళ్ళొద్దాం. ఏమంటావ్? — కళ్ళజోడు అద్దాల్లోంచి కాకుండా పైనుండి చూపులు విసుర్తూ అడిగేడు.

చింత చచ్చినా పులుపు చావలేదు అనుకుంది.

పోయినవాళ్ళ కోసం మడిగట్టుకు కూర్చుంటే... మన బ్రతుకులు తెల్లారినట్టే. అంచేత... నామాట విను! నాతో రా!"

"తప్పండీ! మీరు తండ్రిలాంటివారు. అలా అనకండి మీకు పుణ్యముంటుంది .."

"అంతేనంటావ్. నీ ఖర్మ! నీముఖాన సుఖపడే రాత లేదులే — అయితే తలుపులన్నీ వేసెయ్.... నేను వెళ్తున్నాను..." అనేసి గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

తలుపు తాళం వేస్తున్న బుచ్చమ్మకు, రాజారావు ప్రవర్తనకు నవ్వాలో ఏడవాలో అర్థంకాలేదు.

*　　*　　*　　*

ఇల్లు చేరుకున్నదన్న మాటేగానీ బుచ్చమ్మ మనసులో ఆలోచనలు తూనీగల్లాగ వెంటాడుతూ వేధిస్తూనే వున్నయ్.

ఏం మనుషులు వీళ్ళు? — ఆడదంటే.. అందులోనూ అండదండలు లేని మనిషంటే వీళ్ళందరికీ ఎందుకింత చులకన?? ఎదుటి వాళ్ళ బ్రతుకులో నిప్పులు పొయ్యాలని ఎందుకు ప్రయత్నిస్తున్నారు వీళ్ళంతా? —

తనంటే జాలీ, సానుభూతీ ఏ ఒక్కరిలోనూ లేదు— అందరూ తన జీవితంలో ఆటాడుకోవాలని చూచే వారే! — తానేం పాపం చేసింది?

ఆడదిగా పుట్టటమే నేరమా? ఈ పవిత్ర భారత దేశంలో తన్లాంటి అభాగినుల జీవితాలకు భద్రత లేనేలేదా?— బ్రతుక్కి రక్షణే లేదా?? —

ఇంకా ఎన్నో ప్రశ్నలు ఆలోచనల్లో బుచ్చమ్మ మస్తిష్కాన్ని తొల్చివేస్తున్నయ్.

అధికారంలో వున్న ఆఫీసరూ .. వయసు మళ్ళిన రాజారావూ .. భార్య ఆస్పత్రిలో వున్నా .. పరాయి ఆడదాని కోసం తాపత్రయపడ్డ సుబ్బారావూ .. పిరికి ఆచారీ, తుచ్ఛమైన ఆలోచన్లు కలిగిన వెంకటేశ్వర్లూ అంతా దోషులుగానే కన్పించారు.

తన బ్రతుకుతో ఇందరు ఆడుకోవాలనుకున్నారు. కుక్కలు చింపిన విస్తరిలా చేయాలని ప్రతివక్కరూ ప్రయత్నించారు.

“హే భగవాన్! నన్ను! ఈ రాక్షసుల బాధనుండి కాపాడే బాధ్యత మాత్రం నీదే...” తడికకు వేలాడుతున్న దేవుడి పటాన్ని చూస్తూ చేతులెత్తి మనసారా నమస్కరించి కళ్ళొత్తుకుంది బుచ్చమ్మ.

[10-10-76 ఆకాశవాణి కడప కేంద్రం నుండి ప్రసారితమైంది]

*With the best compliments*

*from*

**ALANKAR WINES, LODGE**

AND

**HOTEL**

HIGH ROAD CHITTOOR (A. P.)

PHONE : **2393**

*With the best compliments*

*from:-*

# ANSAR BATTERIES,

Post Box No. 58

*Manufacturers of Batteries*

AND

*Battery Plates*

**For effective and smooth operation of all Motor Vehicles**

**Prop: S. ANSAR**

Phones Office: **2946**
Res: **2716**

E. 6. Industrial Estate
CHITTOOR - 517127.